క్లుప్తంగా

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

తెనాలి: భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ), బోసురోడ్డు బ్రాంచిలో మంగళవారం గురుపూజోత్సవం చేశారు. సాయంత్రం జరిగిన సభకు బ్రాంచి మేనేజరు చలపతిరావు అధ్యక్షత వహించారు. విశ్రాంత ఉపాధ్యాయిని విశాలక్ష్మి, విశ్రాంత తెలుగు పండితులు ఈఎల్‌వీ అప్పారావును సత్కరించారు. క్షేత్రీయ అధికారి మస్తాన్ సభను ప్రారంభించారు. నగదు అధికారి యోబు, సిబ్బంది ప్రవీణ్, సాయి సుష్మ, బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వైద్య సామగ్రి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెడికల్ సామాగ్రిని మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన ప్రసాదం భోగలక్ష్మి కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సామగ్రిని అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎయిర్‌బెడ్, సెక్షన్ క్లీనింగ్ మిషన్, బి.పి.మిషన్, ఇతర మెడికల్ సామగ్రిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ దిలీప్‌కు అందజేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి రాజేంద్రప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో తోట శ్రీకాంత్, పంది నారాయణ, గోపిశెట్టి ముసలయ్య, షేక్ కరీముల్లా, పొగర్తి శివయ్య, ఉన్నం జాన్‌బాబు, మోదుకూరి దావీదు, పఠాన్ నాగూర్ మీరా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం కాశీ విశ్వేశ్వర స్వామి శాంతి కల్యాణం



బోలాయపాలెం(కర్లపాలెం): అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి శాంతి కల్యాణం మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గణపతి పూజ మహాన్యాసం పంచగవ్య ప్రాసన, పుణ్యాహవచనం, ఏకరుద్ర వారాభిషేకం, బ్రహ్మశ్రీ పాలపర్తి ప్రేమచంద్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కమలానందభారతీస్వామి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

ప్రమాద నివారణ చర్యలపై అవగాహన

రేపల్లె రూరల్: ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అపర్ణ అన్నారు. ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సా విధానంపై తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు ఫౌండేషన్ సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కుర్రా మహేష్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి

రేపల్లె: రుణాలు ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి డ్వాక్రా మహిళలను మోసగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం డ్వాక్రా మహిళలు ఎస్ఐ అబ్దుల్ రజాక్‌కు ఫిర్యాదు చేశారు. తీసుకోని రుణాలకు తిరిగి సొమ్ము చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు మహిళలకు అందాయన్నారు. రుణాలు ఇప్పిస్తామంటూ వారి నుంచి ఆర్పీలు, కొంత మంది ఆధార్ తదితర పత్రాలు పొంది బ్యాంకర్ల నుంచి కోట్ల రూపాయల సొమ్మును తీసుకున్నారని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి నోటీసులు అందటంతో విషయం తెలుసుకున్న మహిళలు ఆందోళనకు గురయ్యారని చెప్పారు. అక్రమంగా రుణాలు పొందిన వారిపై కేసులు నమోదు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్పీలు, ఇతర అధికారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశీర్వాదం, ఐద్వా కార్యదర్శి షేక్ ఆశ, గౌరవాధ్యక్షురాలు నాగమణి, నాయకులు షబానా సుల్తానా, గౌసే, నాంచారమ్మ, భూలక్ష్మి పాల్గొన్నారు.



భావి భారత నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం

- తెనాలిలో ఘనంగా గురుపూజోత్సవం
- పలు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు ఘన సన్మానం



వీఎస్సార్ కళాశాలలో డాక్టర్ ఆంజనేయులును సన్మానిస్తున్న కరస్పాండెంట్



ఎస్ఎస్ఎస్‌హెచ్ఎం స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

తెనాలిఅర్బన్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువరానిదని ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వాసవీ క్లబ్ తెనాలి వారి ఆధ్వర్యంలో మారీసుపేట ఎస్‌సీఆర్ స్కూల్ ఆవరణలోని ఎలిమెంటరీ స్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ప్రాముఖ్యమైందన్నారు. ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో పనిచేస్తూ మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, జయంతిబాబులను ఘనంగా సన్మానించారు. అలాగే వాసవీక్లబ్ తెనాలి, వాసవీ క్లబ్ లండన్, వాసవీ క్లబ్ కాలిఫోర్నియా సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎ.బాలగణేష్, సభ్యులు రమేష్, ఆలపాటి కామేశ్వరరావు, కోట మోహనరావు, మేడా వెంకట సుబ్బారావు, సంక రాజదుర్గాప్రసాద్, గొడవర్తి మల్లిఖార్జున రావు, పొట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బాయ్స్ హైస్కూల్‌లో పిచ్చయ్యను సన్మానిస్తున్న హెచ్ఎం మౌలాబి, శివశంకర్, తదితరులు



ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతిబాబులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్‌ల ప్రతినిధులు

- పూర్వ విద్యార్థుల సంఘ కన్వీనర్ తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విశ్రాంత స్కూల్ సూపర్‌వైజర్ కన్నెగంటి పిచ్చయ్యను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ మౌలాబి, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు చుక్కాభానుప్రసాద్, కాసరనేని శ్రీనివాసరావు, కె.కె.శ్రీను, ఎస్ఆర్‌కే శర్మ, ముద్దాబత్తుని రమణయ్య, అడపా సంపత్‌రాయుడు, పొట్టి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.
- అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్లో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు ఆంజనేయశర్మ, బి.ప్రకాశరావు, హరినాథ్, సునీతలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పిల్లి రాజకిషోర్, టీఎంసీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



జేఎంజే కళాశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

- లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో మారీసుపేటలోని స్పెషల్ మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం స్కూల్ హెచ్ఎం అహ్మద్ హుస్సేన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, నాయకులు నంబూరు శ్రీ కుమార్, అయినాల మల్లేశ్వరరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, వెచ్చా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.
- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆంజనేయులు, ఇటీవల పీహెచ్‌డీ సాధించిన కామర్స్ అధ్యాపకురాలు డాక్టర్ శీలాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, డాక్టర్ రామారావు, నన్నపనేని సుగుణ పాల్గొన్నారు.
- గంగానమ్మపేటలోని టీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఎ.జ్యోతి, డీవీఆర్ ప్రసాద్, జి.విజయ్‌పాల్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 35వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గొడవర్తి శ్రీ సాయిహరేరామ్, నాయకులు తాడిబోయిన నాగార్జున, శ్రీరామమూర్తి, సాయి పాల్గొన్నారు.
- జేఎంజే కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు అధ్యాపకులను విద్యార్థినులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, అధ్యాపకులు డాక్టర్ బి.జ్యోతిస్వరూపరాణి, డాక్టర్ నిర్మల జ్యోతి, డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.



షేక్ అహ్మద్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ప్రతినిధులు



టీఎస్ఆర్ ఎంహెచ్ స్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కౌన్సిలర్ సాయిహరేరామ్



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

మహిళలకు బాలికలకు రక్షణ కవచం 'దిశ'

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యూష

తెనాలిరూరల్: 18 ఏళ్ల లోపు కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని మహిళా న్యాయవాది పేట ప్రత్యూష తెలిపారు. స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో మంచి చెడు స్పర్శలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు మంచి చెడు స్పర్శల గురించి అదే విధంగా యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు.

న్యాయవాది ప్రత్యూష మాట్లాడుతూ కిశోర బాలికలు మంచి చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తులే కాకుండా తెలిసిన వారుసైతం బాలికలతో చెడుగా ప్రవర్తించే సందర్భాలు ఉంటాయని, అలాంటి ఘటన ఎదురైతే వెంటనే సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా వున్న దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, మహిళా పోలీసులు సరిత. అనుజ్ఞ, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్.హేమలత, విద్యార్థినులు పాల్గొన్నారు,

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి

గ్రూప్-1 విజేత స్రవంతి రెడ్డికి సత్కారం

తెనాలి: స్థానిక ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కాలేజీలో మంగళవారం భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కాలేజి ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ విద్యారంగంలో అమూల్యమైన సేవలను అందించిన రాధాకృష్ణన్, భారత రాష్ట్రపతి పదవిని చేపట్టినట్టు ఆయన చెప్పారు. డాక్టర్ రాధాకృష్ణన్ అధ్యాపకులకే కాకుండా విద్యార్థులకూ ఆదర్శప్రాయుడని అన్నారు. ఇటీవల గ్రూప్-1 పరీక్షల్లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ అధికారిగా ఎంపికైన కాలేజి సీనియర్ అధ్యాపకుడు ఎం.దశరధరామిరెడ్డి కుమార్తె స్రవంతిరెడ్డి మాట్లాడుతూ గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల ప్రిపరేషన్‌పై విద్యార్థులకు తన అనుభవాలను తెలియజేశారు. అనంతరం దశరధరామిరెడ్డి, స్రవంతిరెడ్డిని అధ్యాపకులు సత్కరించారు. అధ్యాపకులు కేవీ రవికుమార్, షేక్ రఫీ, ఎ.నాగరాజు, టీజీ కళావతి, ఆర్‌వీ సునీత విద్యార్థులు పాల్గొన్నారు.



స్రవంతిరెడ్డి, తండ్రి దశరధరామిరెడ్డిని సత్కరించిన అధ్యాపకులు

భవిత కేంద్రంలో గురుపూజోత్సవం

తెనాలి: పట్టణ బాలాజీరావుపేట 33వ వార్డులో గల ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికల కేంద్రం 'భవిత'లో మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించారు. తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ అచ్యుత సాంబశివరావు భవిత కేంద్రం ఉపాధ్యాయులు, సిబ్బందిని శాలువలతో సత్కరించారు. కేక్ కట్‌చేశారు. అక్కడి బాలబాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వ్యక్తిగత కార్యదర్శి సునీల్ పర్యవేక్షించారు.



ఉపాధ్యాయులకు సత్కారం

బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక మూల్పూరు సుబ్రహ్మణ్యశాస్త్రి కళ్యాణమండపంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పరిషత్ అధ్యక్షుడు పరాశరం వెంకట రామ్‌గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. విశ్రాంత అధ్యాపకుడు, ప్రముఖ జ్యోతిష్య పండితుడు శర్మద (జనస్వామి సుబ్రహ్మణ్యశర్మ), విశ్రాంత ఉపాధ్యాయుడు చిలుమూరు వరప్రసాదరావు, ఉపాధ్యాయుడు గంజాం పున్నమాచార్యులు (పూర్ణ)లను సత్కరించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ త్రిపురారిభొట్ల జ్ఞానప్రసూనాంబ, వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ డైరెక్టర్ వంగల మాధవరావు, బ్రాహ్మణ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఎస్ఆర్‌కే శర్మ పాల్గొన్నారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పాతావఝుల పురుషోత్తమశర్మ, కార్యవర్గసభ్యులు పర్యవేక్షించారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలీదా నసీమ్‌కు సత్కారం



సత్కారం అందుకున్న గురువులతో ఎమ్మెల్యే శివకుమార్, బ్రాహ్మణ పరిషత్ నేతలు

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో

తెనాలి: పట్టణ కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ సౌజన్యంతో జరిగిన ఈ వేడుకకు అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

గురుపూజోత్సవం ప్రాధాన్యత, గురువుల ప్రాముఖ్యతను మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు, మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి ముమ్మనేని భానుమతి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మాతంగి సత్యసాగర్ మాట్లాడారు. రెడ్‌క్రాస్ సొసైటీచే 50 మంది విశ్రాంత ఉపాధ్యాయులను, అతిథులను సత్కరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి పర్యవేక్షించారు.

మౌలిక వసతుల కల్పనకు గ్రామ దర్శిని దోహదం

కొల్లూరు : గ్రామ స్థాయిలో నెలకొని ఉన్న సమస్యలను గుర్తించి, మౌలిక వసతులను మెరుగు పర్చడానికి గ్రామదర్శిని కార్యక్రమం దోహదపడుతుందని డీఆర్‌డీఏ పీడీ, వేమూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి అర్జునరావు అన్నారు. మంగళవారం బొద్దులూరుపాడులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన గ్రామ దర్శిని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖల వారీగా గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి విచారణ చేశారు. పీడీ దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకువచ్చారు. కొల్లూరు నుంచి గ్రామానికి చేరుకునే ఏకైక ప్రధాన మార్గం అధ్వానంగా ఉందని, రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. దీంతో స్పందించిన అర్జునరావు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చొరవతో రహదారి నిర్మాణానికి రూ. 80 లక్షలు నిధులు మంజూరయ్యాయని త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. గ్రామంలో డ్రెయినేజ్ వ్యవస్థ లోపం, విద్యుత్తు స్తంభాల కొరతను గుర్తించి, పరిష్కరిస్తామని స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుర్రం మురళి, ఈఓపీఆర్‌డీ రవి, ఆర్ఐ త్రివేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు గుర్రం వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఆలయానికి కలశాల వితరణ

తెనాలి: పట్టణ కొత్తపేటలోని శ్రీవిరాట్ విశ్వకర్మ దేవస్థానంలో ఉప ఆలయాల పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి దుగ్గిరాలకు చెందిన ఎస్.శివప్రసాద్, చుక్కా శ్రీనివాసబాబులు నవగ్రహ మంటప కలశాన్ని సమర్పించారు. శివాలయ కలశాన్ని ఉదయశంకర్ సమకూర్చారు. ఆలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వీటిని దాతలు ఆలయ ఈవో మల్లీశ్వరి, అర్చకులకు అందజేశారు. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా 1951లో కాశీ గోవిందమ్మ నిర్మించిన ఈ దేవస్థానంలో నవగ్రహాలు, శివమందిరం, దాసాంజనేయస్వామి ఉప ఆలయాలు ఉన్నాయి. ఉప ఆలయాల జీర్ణోద్ధరణలో భాగంగా ఈనెల 8వ తేదీన ఆరికట్ల గోవర్ధన శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీగణపతి, కుమారస్వామి, కంచి కామాక్షి అమ్మవారు, శివాలయం, దాసాంజనేయస్వామి వార్ల పునఃప్రతిష్ఠ జరగనుంది. యలవర్తి ఆంజనేయ శాస్త్రి వేద పాఠశాల చైర్మన్ నూతలపాటి సురేష్, చుక్కా భానుప్రసాద్, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కలశాన్ని అందజేస్తున్న శివప్రసాద్, శ్రీనివాసబాబు

దోమలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ దోమలపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం సూచించారు. తెనాలి సాలిపేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు దోమల ఉధృతికి కారణమన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వస్తాయని చెప్పారు. వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. సమావేశంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్ కుమార్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి డి.రాజునాయక్, యూనిట్ అధికారి వంగాల పున్నారెడ్డి, సిబ్బంది శివగణేష్, అందె బాలచంద్రమౌళి, రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

సీపీఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి...సీపీఎం కార్యదర్శి



మాట్లాడుతున్న తెనాలి కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలిఅర్బన్: నిరుద్యోగ నిర్మూలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీఎం తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో నిరుద్యోగం దేశంపై దాని ప్రభావం అనే అంశంపై చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, అరకొర ఉపాధి రెండూ దేశానికి ప్రధాన శత్రువులని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే అంశాన్ని తెలియజేస్తుందన్నారు. కానీ నేటి పాలకులు దానిని విస్మరించారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న 9.82 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు కిరణ్, కె.కృష్ణకాంత్, రైతు సంఘం నాయకులు సాంబిరెడ్డి, సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, ఎస్.రాజ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్ ఈశ్వర్, కె.సుభాష్, యోగేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



కర్లపాలెం: తుమ్మలపల్లి పంట కాలువలో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. సుమారు 55 ఏళ్ల వయస్సు గల ఓ మహిళ మృతదేహం తుమ్మలపల్లి గ్రామంలోని పంట కాలువలో నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిందన్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశామన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 9440900870 నంబరుకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.